క్లుప్తంగా

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఆమదాలవలస రూరల్: రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని కృష్ణాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మార్చి 15వ తేదీలోగా నాలుగు శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవచ్చునని సూచించారు.

123 మందికి వైద్య సేవలు

పాతపట్నం: పాతపట్నంలోని సచివాలయం-2లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య తనిఖీలు చేపట్టారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ 123 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

సారవకోట: చీడిపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ గేదెల జానకమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈమె మృతిపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

భగత్‌సింగ్ ట్రస్టు ఔదార్యం



శ్రీనివాసరావుకు సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: ఆపదలో ఉన్న ఇద్దరికి కుంటిభద్ర గ్రామానికి చెందిన భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కుంటిభద్ర గ్రామానికి చెందిన చెరుకూరి శ్రీనివాసరావు క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలం కీసర గ్రామానికి చెందిన రుడార ప్రసాదరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో అతనికి 15 వేల రూపాయలను శుక్రవారం అందజేసి అండగా నిలిచారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

సరుబుజ్జిలి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ అన్నారు. రొట్టవలస జంక్షన్ వద్ద హెల్మెట్ ధారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పోలాకి జయమునిరావు, పరపటి యోగేశ్వరరావు సందర్శించారు. ఎంతమంది చిన్నారులున్నారు, వారికి ప్రాథమిక విద్య అందుతున్న తీరు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీపై ఆరాతీశారు. మెనూను సక్రమంగా అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్త సులోచనకు సూచించారు.

రేషన్ డిపోపై కేసు నమోదు

సరుబుజ్జిలి: మూలసవలాపురం రేషన్ డిపోపై 6-ఏ కేసు నమోదు చేశామని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ డబ్బీరు రామకృష్ణ శుక్రవారం తెలిపారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు డిపోలో తనిఖీ చేయగా సరకులు పూర్తిగా లేకపోవడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరం

నరసన్నపేట: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూరాలజిస్టు బుడుమూరు రమణ అన్నారు. స్థానిక ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. 76 మందికి వైద్య తనిఖీలు చేసి మందులు అందజేశారు. గుండె సంబంధిత వ్యాధులపై కార్డియాలజిస్టు సాత్విక్, కంటి వ్యాధులపై నేత్ర వైద్యురాలు హరిప్రియ వివరించారు.

విద్యా సామర్థ్యం పరిశీలన

ఎల్.ఎన్.పేట: విద్యార్థులు చదువులో వెనుకబడి ఉండకూడదని ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కోవిలాం పాఠశాలలో వార్షిక పర్యవేక్షణలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు జె.ఉష, సీఆర్పీ అచ్యుతరావు ఉన్నారు.

104 వాహన వైద్య సేవలు

పొందూరు: వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీతులసి అన్నారు. ధర్మపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 104 వాహన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాలకృష్ణ

కొత్తూరు: కొత్తూరు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.బాలకృష్ణను నియమిస్తూ టెక్కలి సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి పనిచేసిన తహసీల్దార్ పి.బాలను గత నెల 24వ తేదీన జిల్లా కార్యాలయానికి ఉన్నతాధికారులు సరెండర్ చేశారు. దీంతో డీటీగా పనిచేస్తున్న బాలకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పాఠశాలల పరిశీలన

బూర్జ: మండలంలోని అన్ని యాజమాన్యల పరిధిలో ఉన్న పలు పాఠశాలలను శ్రీకాకుళం డిప్యూటీ ఈవో డాక్టర్ తిరుమల చైతన్య ఆధ్వర్యంలో డైట్ బృందం సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. 35 మందితో కూడిన బృందం పాఠశాలల స్థాయి, మౌలిక వసతులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలో ఎంఆర్సీ ఆవరణలో ఎంఈఓ ఎన్.రామకృష్ణ అధ్యక్షతన సమావేశమై పాఠశాలల స్థితిగతులపై చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కల్యాణ వైభోగం..



చిన్నదుగాం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు, ఈవో వీవీఎస్ నారాయణ పాల్గొన్నారు. -జలుమూరు

చట్టాలపై అవగాహన



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.హెచ్.ఆర్.టి చక్రవర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై ఎస్.కామేశ్వరరావు, ఎంఈవో సీహెచ్ మణికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి పాల్గొన్నారు. -పాతపట్నం

తక్షణ సాయం



నరసన్నపేటలోని పసారవీధికి చెందిన బొజ్జ రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం మంజూరు కావడంతో ఆ మొత్తాన్ని అతని భార్య మాధవికి సర్పంచ్ బూరల్లి శంకర్ శుక్రవారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చీపురు నారాయణరావు పాల్గొన్నారు. -నరసన్నపేట

మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని

- రోడ్డు పనుల శంకుస్థాపనలో స్పీకర్ తమ్మినేని

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తొగరాం పంచాయతీ ఇసుకలపేట గ్రామంలో రూ. 90 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గ అభివృద్ధే ధ్యేయంగా గ్రామాల్లో రహదారులు, మంచినీటి కుళాయిలు, వీధిదీపాల ఏర్పాటు పనులను తక్షణమే పూర్తి చేస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇసుకలపేట గ్రామ రహదారి అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతుందని గుర్తు చేశారు. గడిచిన ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణానికి హామీలు ఇచ్చారే తప్పా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం జరుగుతోందని..ఇది పూర్తయితే ఇసుకలపేట గ్రామం మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. భూముల ధరలు పెరుగుదలతో పాటు వ్యాపారాలు, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించారు. బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తొగరాం గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు మెట్ట ఆనందరావు, కూటికుప్పల సన్యాసిరావు, సైలాడ దాసునాయుడు, చిగిలిపల్లి దశరథ, తిర్లంగి రామారావు,ు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ



నీలకంఠేశ్వరవీధిలో మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- పాతపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పాతపట్నం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ చేస్తోందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రం పాతపట్నంలోని గ్రామ సచివాలయం-1 పరిధిలోని కిరణ్మయి, నీలకంఠేశ్వర, మార్కెట్ వీధులు, రత్నాలపేట, షిర్డీనగర్, రాజీవ్‌నగర్ (చర్చివీధి)లో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి సంబంధిత బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఆమె స్పందిస్తూ రెండో విడతలో జగనన్న కాలనీలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీలు నిర్మించాలని, రోడ్డు మధ్యలో ఉన్న పాడైపోయిన బోరును తొలగించాలని నీలకంఠేశ్వర వీధి వాసులు కోరుగా సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కె.అర్జునుడు, తాతయ్య. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఎం.గణపతి, తహసీల్దార్ కె.రవిచంద్ర, ఎంపీడీవో సురేష్, ఈవోడీఆర్డీ ప్రసాద్ పండా, ఏవో అప్పలనాయుడు, ఈవో కుర్మారావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, పార్టీ నాయకులు పనుకు మోహన్, పడాల రంజీత్, శ్రీధర్, క్రిష్టారావు, రాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న దృశ్యం

హిరమండలం: కొండరాగోలు ఏబీ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్దగూడ పంచాయతీ లంకగుడ్డి గిరిజన గ్రామానికి చెందిన సవర కూర్మయ్య, గొట్టిపల్లి పంచాయతీ పెద్దరాజపురం గ్రామానికి చెందిన సవర జోగారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వెంకట రామకృష్ణ, తిరుపతిరావు, సాధుబాబు ఉన్నారు.

వలంటీర్‌పై ఫిర్యాదు

మెళియాపుట్టి: వైఎస్సార్ భరోసా పింఛన్లు చాపర గ్రామ సచివాలయం పరిధిలో అందలేదని పలువురు లబ్ధిదారులు ఎంపీడీవో పి.చంద్రకుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ వలంటీర్ జి.యుగంధర్ పింఛన్లు పంపిణీ చేయటం లేదని, ముందుగా వేలిముద్రలు తీసుకుని వారం రోజుల తరువాత డబ్బులు అందజేస్తున్నారని వివరించారు. స్పందించిన ఎంపీడీవో సంబంధిత పంచాయతీ కార్యదర్శి మోహనరావును గ్రామానికి పంపించి వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పింఛన్లు పంపిణీ చేశారు. ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు గ్రామ వలంటీరుకు షోకాజ్ నోటీసు జారీ చేశామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

భువనేశ్వర్ వెళ్లి.. పింఛన్ అందజేసి..



చిన్నమ్మడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరసమ్మ

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ నాలుగో వార్డు పరిధి కసింవలసకు చెందిన వలంటీర్ గుజ్జల నరసమ్మ భువనేశ్వర్ వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆదర్శంగా నిలిచారు. గొర్లె చిన్నమ్మడు భువనేశ్వర్‌లోని తన కుమార్తె రాములమ్మ ఇంటికి వెళ్లిపోయింది. దీంతో గత నెలకు మంజూరైన వృద్ధాప్య పింఛన్ డబ్బులు వెనక్కి వెళ్లిపోయాయి. ఈ పరిస్థితుల్లో చిన్నమ్మడు పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ నరసమ్మ పెద్దమనసుతో తన సొంత ఖర్చులతో భువనేశ్వర్ వెళ్లి ఈ నెల పింఛన్‌ను చిన్నమ్మడుకు అందించారు.

భవన నిర్మాణాల పరిశీలన

పొందూరు: భవనాల నిర్మాణంలో ప్రమాణాలు పాటించకుంటే బిల్లులను నిలుపుదల చేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఎంవీ శేఖర్ హెచ్చరించారు. రాపాకలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాల పనులను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సిబ్బందికి సూచించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు జరిగేలా నిరంతర పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులు చేయాలన్నారు. ఈఈతో పాటు క్వాలిటీ కంట్రోల్ డీఈ శామ్యూల్, పీఆర్ డీఈ ప్రకాశరావు, ఏఈ సత్యన్నారాయణ ఉన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: కొత్తూరు మండలంలో అందరి ఆమోదంతో నియమించిన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పని చేయాలని గ్రామ సచివాలయం కన్వీనర్ల మండల కన్వీనర్ కామక త్రినాథరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోగుల వరప్రసాద రావునాయుడు అన్నారు. కొత్తూరులో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం సమర్థవంతగా పాటుపడుతున్న వారిని గుర్తించి కన్వీనర్లు, గృహ సారథులుగా నియమించడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వంశధార నిర్వాసితుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో అదనపు పరిహారం కింద రూ. 216.71 కోట్లు విడుదల చేయగా.. దీనిలో రూ. 151 కోట్లు నిర్వాసితుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని, మిగిలిన రూ. 65.71 కోట్లు త్వరలో మిగిలిన వారికి జమ చేయడం జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా నిర్వాసితులు ఖాతాల్లోకి నేరుగా అదనపు పరిహారాలు జమ చేస్తున్నట్టు చెప్పారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించేటప్పుడు మండలంలోని అందరి నాయకులకు ఎమ్మెల్యే సమాచారం ఇస్తున్నారన్నారు. జిల్లాలోనే పాతపట్నం నియోజవర్గం కార్యక్రమం నిర్వహణలో ముందంజలో ఉందన్నారు. సమావేశంలో కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, పారాపురం ఎంపీటీసీ సభ్యురాలు వనుము లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు పాల్గొన్నారు.

ముగిసిన ప్రవచనాలు



ప్రవచనాలు వినిపిస్తున్న శ్రీనివాసరావు

కొత్తూరు: యుగాలు మారుతున్నా.. రామ నామం ఆగదని ప్రముఖ ప్రవచనకర్త యాలల శ్రీనివాసరావు అన్నారు. రథసప్తమి సందర్భంగా కొత్తూరు సీతారామాలయంలో ఏడు రోజులు నిర్వహించిన ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. సీతారామ కల్యాణంతో ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా ప్రవచనకర్త మాట్లాడుతూ.. శ్రీరామ నామం ప్రతినిత్యం స్మరించుకోవడం ద్వారా జన్మధన్యమవుతోందన్నారు. నమ్ముకున్న భక్తులకు శ్రీరాముడు రక్షకుడుగా ఉంటారన్నారు. నేటి నవతరానికి రామాయణం, భారతం, భాగవతం వంటి ఇతిహాసాలు పరిచయం చేయడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రవచకర్త శ్రీనివాసరావును ఆలయ కమిటి సభ్యులు లోతుగెడ్డ తాతబాబు, భగవాన్ నాయుడు, పొగిరి అర్జున, పి.విశ్వనాథం, పొగిరి రవి తదితరులు దుశ్శాలువతో సత్కరించారు.

వృద్ధులపై బాధ్యతగా ఉండాలి

నరసన్నపేట: వృద్ధులు, తల్లిదండ్రుల పట్ల కుటుంబ సభ్యులు బాధ్యతగా ఉంటూ వారిపట్ల ప్రేమానురాగాలు చూపించాలని నరసన్నపేట ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. గొట్టిపల్లి సమీపంలోని వృద్ధాశ్రమాన్ని కళాశాలకు చెందిన మహిళా సాధికారిక కమిటీతో కలిసి అధ్యాపక సిబ్బంది శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజన వసతి కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆశ్రమాలకు పంపించేసి కుటుంబ సభ్యుల ప్రేమకు దూరం చేయడం తగదన్నారు. వృద్ధుల్లో మానసిక ధైర్యాన్ని కల్పించాలన్నారు.

గృహ సారథులే విజయ సారథులు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని

బూర్జ: గృహ సారథులే రేపటి విజయ సారథులని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొల్లివలస గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ ముమ్ముందు కూడా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపించాలని.. అందుకు మీరంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పోటీ పేదవాడికి.. పెత్తందారీ వ్యవస్థకు మధ్య జరుగుతోందన్నారు. పేదవాడు గెలవాలంటే మళ్లీ జగన్‌కు విజయాన్ని అందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 612 హామీలిచ్చి..ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసగించారన్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో సీఎం జగన్ నవరత్నాలు ప్రకటించి ప్రభుత్వం ఏర్పడ్డాక మూడున్నరేళ్లలో 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. పార్టీ విజయానికి సైనికులా పనిచేయాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండ ల కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, స్థానిక సర్పంచ్ జీడి వేణు, వైస్ ఎంపీపీలు కరణం కృష్ణమూర్తినాయుడు, బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బల రాంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, మండల సచివాలయ కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఆటో డ్రైవర్‌కు గాయాలు

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన ఆటో డ్రైవర్ జి.శ్రీనివాసరావు గాయపడ్డారు. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్లే మార్గంలో ఆగిఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. శ్రీనివాసరావు కాలుకి బలమైన గాయం కావడంతో ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

సచివాలయాలను సందర్శించిన పీవో



పారాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న పీవో నవ్య

కొత్తూరు: గ్రామ సచివాలయ సిబ్బంది విధిగా యూనిఫాం ధరించాలని సీతంపేట ఐటీడీఏ పీవో బి.నవ్య ఆదేశించారు. మెట్టూరు బిట్-1, 2, 3, పారాపురం సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. గ్రామ సచివాలయానికి సంబంధించిన ఆర్థిక పరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం పారాపురం విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు.

విశ్వనాథ్‌కు ఘన నివాళి



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతి కళారంగానికి తీరని లోటని కిరణ్మయి సంస్కృతి సంస్థ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కిరణ్మయి కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో కళాతపస్వి సంస్మరణ సభ నిర్వహించారు. సంస్థ సభ్యులు విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎస్.చిరంజీవి, సారవకోట ఎంఈవో ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



అనంతరావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రశాంతనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుంపు అనంతరావు (64) ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఓ శుభకార్యానికి ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుసాని సమితి కొర్సండ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ పర్లాకిమిడి పోలీసు స్టేషన్ పరిధిలోని పోద్దుణి కూడలి వద్ద అనంతరావు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

ఆమదాలవలస రూరల్: రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సూచించారు. బెలమాంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో చిరు ధాన్యాలైన రాగి, కొర్రలు, సజ్జ, జొన్నలు వేసుకో వాలన్నారు. చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా పంట మార్పిడి జరిగి నేల సారవంతమవు తోందన్నారు. సమావేశంలో సర్పంచ్ కణుగుల కిశోర్ పాల్గొన్నారు.

కిడిమిలో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

సారవకోట: కిడిమి గ్రామంలో కొత్తగా నిర్మించిన శివాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూల విరాట్ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

హిరమండలం: పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఎంఈవో కె.రాంబాబు ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాస్ పుస్తకాల పంపిణీ

ఎల్.ఎన్.పేట: కవిటి రెవెన్యూ గ్రామంలో సమగ్ర భూరీసర్వే పూర్తయింది. దీంతో కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తలసముద్రం శోభన్‌బాబు, సర్వే విభాగం డీటీ కనకమహాలక్ష్మిలు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు భూములు, రైతుల వివరాలతో కూడిన పాస్ పుస్తకాలు (భూమి హక్కు పత్రాలు) పంపిణీ చేస్తున్నామన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నరసన్నపేట: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి గొలివి సుజాత అన్నారు. ఉర్లాం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, కుష్ఠు వ్యాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్, ప్రధానోపాధ్యాయుడు హర్ష వర్ధన శర్మ పాల్గొన్నారు.

స్పందన వినతులు పరిష్కరించాలి

జలుమూరు: స్పందనకు వచ్చే వినతులు త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీవో జీవి రవికుమార్ అన్నారు. రాణ, టెక్కలిపాడు సచివాలయాలను శుక్రవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ విస్తరణాధికారి ఉమామహేశ్వరరావు ఉన్నారు.